సాక్షి నిర్మల్

బుధవారం ၊ 22 ၊ నవంబర్ ၊ 2023



ఇంతింతై..40 రెట్లై

అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థి ఖర్చు1952లో గరిష్టంగా రూ.లక్ష ఉండేది. 2023 ఎన్నిక ల్లో ఈ మొత్తం రూ.40 లక్షలకు పెరిగింది.

10లో▸

ఓటుహక్కును వినియోగించుకోవాలి

మామడ:రానున్న ఎన్నికల్లో అర్హులైన ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసు కోవాలని డీఆర్డీవో విజయలక్ష్మి అన్నారు. మండల కేంద్రంలో ఓ టర్లకు ఓటు సద్వినియోగంపై మంగళవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమేశ్, ఈజీఎస్ ఏపీవో శివాజీ పాల్గొన్నారు.

గరిష్టం/కనిష్టం 32.4/17.9

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం లో అక్కడక్కడా మబ్బులు ఉంటాయి. చాలావరకు ఎండగా ఉంటుంది. రాత్రి ఉష్ణో గ్రతలు తగ్గుతాయి. చలి పెరుగుతుంది.

న్యూస్‌రీల్

ఆపదలో ఆందోళన చెందొద్దు



అవగాహన కల్పిస్తున్న షీటీం పోలీసులు

నిర్మల్‌టౌన్: ఆపదలో ఆందోళన చెందకుండా 100కు డయల్ చేయాలని షీటీం ఎస్సై సుమంజలి సూచించారు. జిల్లా కేంద్రంలోని వశిష్ఠ జూనియర్ కళాశాల విద్యార్థినులకు షీటీం సేవలపై మంగళవారం అవగాహన కల్పించారు. 100కు డయల్, సీసీ కెమెరాలతో లాభాలు, బాల్యవి వాహాలు, బాలకార్మిక వ్యవస్థ, కమ్యూనిటీ పోలీసింగ్, మానవ అక్రమ రవాణా, మద్యపాన నిషేధం, ఆన్‌లైన్ మోసాలు, గంజాయి నిర్మూలన, డ్రగ్స్ నిషేధం, టోల్ ఫ్రీ నంబర్ 1930తో ప్రయోజనాలను వివరించారు. షీటీం ఎమర్జెన్సీ నంబర్ 8712659550కు ఫోన్ చేయాలనీ సూచించారు.

మంత్రికి ఆహ్వానం



మంత్రిని ఆహ్వానిస్తున్న నాయకులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని బుధవార్‌పేట్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ సభ్యులు, ముఖ్య నాయకులు మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిని మంగళవారం కలిశారు. ఈనెల 23న పద్మావతిసమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించే ధ్వజస్తంభ ప్రతిష్టాపన కార్యక్రమానికి హాజరు కావాలని ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ అప్పాల గణేశ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేందర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పూదరి సాయికృష్ణ, గంట రాకేశ్, జగదం రాజు, ఆలయ కమిటీ సభ్యులు వెంకట్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంజేపీ విద్యార్థులు



జాతీయ క్రీడలకు ఎంపికైన విద్యార్థులు

లక్ష్మణచాంద:రాష్ట్ర స్థాయి క్రీడలకు మండలంలోని రాచాపూర్ ఎంజేపీ విద్యార్థులు మంగళవారం బయల్దేరారు. మండలంలోని రాచాపూర్‌లోని మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల, కళాశాల నుంచి విద్యార్థులు హైదరాబాద్‌కు తరలివెళ్లారు. హైదరాబాద్‌లోని తుర్కపల్లిలో జరిగే అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనడానికి మొత్తం 66 మంది వెళ్లారని ప్రిన్సిపాల్ సంతోష్ కుమార్ తెలిపారు. వారివెంట ఏటీపీ నారాయణ, పీఈటీ రాజేందర్, ఉపాధ్యాయులు సంతోష్, సాగర్, అధ్యాపకులు నాగరాజు ఉన్నారు.

'బీజేపీ, బీఆర్ఎస్‌లను ఓడించాలి'



మండల కేంద్రంలో మాట్లాడుతున్న రాజన్న

లక్ష్మణచాంద:తెలంగాణ ఎన్నికల్లో ప్రజలు నియంతృత్వ, మతోన్మాద ఫాసిస్టు బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలను ఓడించాలని(సీపీఐఎంఎల్)ప్రజా పంథా జిల్లా కార్యదర్శి కె.రాజన్న కోరారు. మండల కేంద్రంలోని అమరవీరుల స్థూపం వద్ద ప్రజాపంథా రాష్ట్ర కమిటీ ముద్రించిన పోస్టర్లు మంగళవారం విడుదల చేశారు. అనంతరం వడ్యాల్‌లో ప్రచారం నిర్వహించారు. ఓటు ప్రజల చేతిలో వజ్రాయుధం అన్నారు. దేశంలో, రాష్ట్రంలో ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తున్న పార్టీలకు ఓటుతో బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాపంథా జిల్లా నాయకులు రామలక్ష్మణ్, ఎం.బక్కన్న, ఎస్.గంగన్న, కె.లక్ష్మి, జిల్లా కార్యదర్శి ఆశన్న తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ఖానాపూర్: పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ఎన్నికల పరిశీలకులు, ఐఏఎస్ అధికారి గోపాలకృష్ణ మంగళవారం సందర్శించారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలతోపాటు మండలంలోని రాజూరా, బావాపూర్(ఆర్), సుర్జాపూర్, మస్కాపూర్, మేడంపల్లి, గోసంపల్లె, పాత ఎల్లాపూర్, కొమ్ముతండా, తదితర గ్రామాలను సందర్శించారు. ఆయన వెంట సెక్టోరియల్ అధికారి రత్నాకర్‌రావు, ఆర్ఐ రాజేశ్వర్, ఎస్సైలు లింబాద్రి, రజనీకాంత్ ఉన్నారు.



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ప్రత్యర్థులు.. మిత్రులు..

- గతంలో ఒకరిపై ఒకరు పోటీ..
- ఇప్పుడు.. ప్రత్యర్థి కోసం కలిసి ప్రచారం
- ఒకే పార్టీలో మిత్రులు, శత్రువులు
- ప్రతీ ఎన్నికల్లో మారుతున్న పరిణామాలు





ఐకేరెడ్డితో కలిసి ప్రచారం చేస్తున్న సత్యనారాయణగౌడ్, విఠల్‌రెడ్డి ప్రచారంలో రమాదేవి..

నిర్మల్:'రాజకీయాలన్నాక ఇవన్నీ కామన్ తమ్మీ..' ఓ సినిమాలో డైలాగ్ ఇది. ఈ మాట కూడా వాస్తవమే. రాజకీయాల్లో ఎప్పుడు ఏం జరుగుతుందో ఊహించడం కష్టమే. ఎవరెవరు శత్రువులు.. ఎవరికి ఎవరు మిత్రులు.. అని చెప్పడమూ అసాధ్యమే. ఒకప్పుడు ఒకరిపై ఒకరు పోటీచేసి, కత్తులు దూసుకున్న వాళ్లే.. ఇప్పుడు చెట్టాపట్టాల్ వేసుకు తిరగొచ్చు. రాజకీయాల్లో శాశ్వత మిత్రులు, శాశ్వత శత్రువులు ఉండరు అన్నట్లుగా జిల్లా రాజకీయాల్లోనూ మిత్రులనుకున్న వాళ్లు.. ప్రత్యర్థులయ్యారు. శత్రువులనుకున్న వాళ్లు మిత్రులుగా మారారు.

జిల్లా వినూత్నం..

నిర్మల్ రాజకీయంగా చైతన్యవంతమైన జిల్లా. ఉమ్మడి జిల్లాలో నిర్మల్‌కు రాజకీయ కేంద్రంగా గుర్తింపు ఉంది. ఇలాంటి చోట రాజకీయ సమీకరణలు ఎప్పుడెలా మారుతాయో.. సాధారణ ఓటర్‌కు అంతుచిక్కదు. కొంతమంది ఐదేళ్లపాటు ఒకపార్టీలో ఉండి.. ఎన్నికల వేళకు మరోపార్టీలోకి మారారు. కొత్తపార్టీ నుంచి.. ప్రజలకు పూర్తిగా పరిచయం కాని పార్టీ నుంచి.. విజయాలను అందుకున్నారు. రాజకీయ జీవితాన్నిచ్చిన వారిపైనే పోటీ చేసి నెగ్గారు. చిరకాల ప్రత్యర్థులు అనుకున్న వారు ఏకమై పార్టీ గెలుపుకోసం శ్రమిస్తున్నారు. ఒకప్పుడు తమ ప్రత్యర్థిగా ఉన్న అభ్యర్థినే గెలిపించాలని కోరుతున్నారు. ఇలా జిల్లా రాజకీయాలు ఎవరికీ అంతుబట్టకుండా సాగుతున్నాయి.

మిత్రులు.. ప్రత్యర్థులు..

నిర్మల్ నియోజకవర్గంలో ప్రస్తుతం ఉన్న నేతల్లో అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, సముద్రాల వేణుగోపాలచారి ఇద్దరూ ఒకరితర్వాత ఒకరు రాజకీయాల్లోకి వచ్చారు. ఇద్దరూ ఎన్టీ రామారావు ప్రారంభించిన తెలుగుదేశంలో కలిసి పనిచేశారు. 1985లో గ్రంథాలయసంస్థ జిల్లా చైర్మన్‌గా, 1987లో జెడ్పీచైర్మన్‌గా, 1991లో ఎంపీగా టీడీపీ నుంచి అల్లోల పనిచేశారు. ఇదే పార్టీలో ఉన్న చారి 1985 నుంచి1994 వరకు నిర్మల్ ఎమ్మెల్యేగా కొనసాగారు. 1991లో ఎంపీగా గెలిచిన ఇంద్రకరణ్‌రెడ్డి అప్పటి పరిస్థితుల్లో కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి మద్దతు పలికారు. ఆ తర్వాత టీడీపీని వీడి కాంగ్రెస్‌లో కొనసాగారు. అప్పటి వరకు మిత్రులుగా ఉన్న వీరిద్దరు 1996, 1998 లోక్‌సభ ఎన్నికల్లో ప్రత్యర్థులుగా పోటీపడ్డారు. ఇందులో టీడీపీ నుంచి పోటీ చేసిన చారి గెలుపొందారు. 2008 లోక్‌సభ స్థానం ఉప ఎన్నికల్లో మరోసారి వీరిద్దరూ ప్రత్యర్థులుగా తలపడగా ఈసారి చారిపై కాంగ్రెస్ అభ్యర్థిగా ఇంద్రకరణ్‌రెడ్డి విజయం సాధించారు. ఆ తర్వాత 2014 ఎన్నికల ముందు చారి బీఆర్ఎస్‌లో చేరి, ముధోల్ నుంచి పోటీచేసి ఓడారు. ఇదే ఎన్నికల్లో నిర్మల్‌లో బీఎస్పీ నుంచి ఇంద్రకరణ్‌రెడ్డి గెలిచి, బీఆర్ఎస్‌లో చేరారు. అలా మళ్లీ పాత మిత్రులు ఒకే పార్టీలో కలిశారు. ప్రస్తుతం ఇద్దరూ జిల్లాలో బీఆర్ఎస్ గెలుపు కోసం పనిచేస్తున్నారు.

గురుశిష్యుల పోటీ..

నిర్మల్ నియోజకవర్గ రాజకీయాల్లో గురుశిష్యులుగా పేరున్న అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, కూచాడి శ్రీహరిరావు ఆ తర్వాత ప్రత్యర్థులుగా, మళ్లీ మిత్రులుగా ఇటీవల మళ్లీ ప్రత్యర్థులుగా మారారు. 2009లో కాంగ్రెస్ నుంచి ఇంద్రకరణ్‌రెడ్డి, మహాకూటమిలో భాగంగా బీఆర్ఎస్ నుంచి శ్రీహరిరావు పోటీపడ్డారు. ఆ ఎన్నికల్లో వీరిద్దరూ కాకుండా ప్రజారాజ్యం నుంచి పోటీ చేసిన ఏలేటి మహేశ్వర్‌రెడ్డి గెలుపొందారు. 2014లో బీఆర్ఎస్ నుంచి శ్రీహరిరావు, బీఎస్పీ నుంచి ఇంద్రకరణ్‌రెడ్డి మళ్లీ తలపడగా, అల్లోల గెలుపొందారు. ఆ తర్వాత ఆయన బీఆర్ఎస్‌లో చేరి మంత్రి కావడం, మొదట్లో శ్రీహరిరావుతో విభేదాలు కొనసాగడం నడిచాయి. 2018 ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ అధిష్టానం వీరిద్దరి మధ్య సయోధ్య కుదిర్చింది. ఆ ఎన్నికల్లో శ్రీహరిరావు పోటీ నుంచి తప్పుకుని అల్లోల గెలుపు కోసం పనిచేశారు. ఆ తర్వాత మళ్లీ వారిద్దరి మధ్య విబేధాలు పెరుగుతూ వచ్చాయి. కొన్ని నెలల క్రితం పార్టీని వీడిన శ్రీహరిరావు కాంగ్రెస్‌లో చేరి మరోసారి ఎన్నికల్లో అల్లోలకు ప్రత్యర్థిగా నిలిచారు.

ప్రత్యర్థులు.. ప్రచారకర్తలు..

- నిర్మల్ నియోజకవర్గంలో గతంలో ప్రత్యర్థులుగా ఉన్నవారు.. ఇప్పుడు ఒకే అభ్యర్థి కోసం ప్రచారం చేస్తుండటం విశేషం. 2004 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా వల్లకొండ సత్యనారాయణగౌడ్ పోటీచేశారు. అప్పుడు కాంగ్రెస్ నుంచి బరిలో ఉన్న అల్లోల గెలిచారు. అనంతరం సత్యనారాయణగౌడ్ బీఆర్ఎస్‌లో చేరారు. ఆయన సతీమణి శోభారాణి జెడ్పీ చైర్‌పర్సన్ అయ్యారు. ప్రస్తుతం సత్యనారాయణగౌడ్ అల్లోల గెలుపు కోసం ప్రచారం చేస్తున్నారు.
- 1996లో జరిగిన ఉప ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీ చేసిన నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి అప్పటి స్వతంత్ర అభ్యర్థి అర్గుల కమలాధర్‌గుప్తాపై గెలుపొందారు. అనంతరం 1999లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగానే బరిలో దిగిన నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి చేతిలో ఓడిపోయారు. ప్రస్తుతం మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి బీజేపీలో చేరి ఏలేటి మహేశ్వర్‌రెడ్డి కోసం పనిచేస్తున్నారు.
- ప్రజారాజ్యం పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేసినప్పుడు అప్పటి ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి కొన్నిరోజులు ఒకే పార్టీలో ఉన్నారు. ప్రస్తుతం వీరిద్దరు వేర్వేరు పార్టీల నుంచి ప్రత్యర్థులుగా పోటీ పడుతున్నారు.
- ఖానాపూర్ నియోజకవర్గంలో గతంలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసిన హరినాయక్ రమేశ్ రాథోడ్‌కు ప్రత్యర్థిగా ఉండేవారు. ప్రస్తుతం బీజేపీ అభ్యర్థిగా ఉన్న రాథోడ్ కోసం హరినాయక్ ప్రచారం చేస్తున్నారు.
- ముధోల్ నియోజకవర్గంలో 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్ ఆశించి విఠల్‌రెడ్డి భంగపడ్డారు. కాంగ్రెస్ నారాయణరావుపటేల్‌ను తమ అభ్యర్థిగా ప్రకటించడంతో విఠల్‌రెడ్డి ప్రజారాజ్యం నుంచి పోటీచేశారు. వేణుగోపాలచారి బీఆర్ఎస్ నుంచి పోటీపడ్డారు. కేవలం 180 ఓట్ల తేడాతో చారి చేతిలో విఠల్‌రెడ్డి ఓడిపోయారు. 2014 ఎన్నిక సమయంలో విఠల్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరి టికెట్ దక్కించుకోగా, బీఆర్ఎస్ నుంచి వేణుగోపాలచారి, బీజేపీ నుంచి పడకంటి రమాదేవి పోటీపడ్డారు. ఈ ఎన్నికల్లో నారాయణరావు పటేల్ బరిలో దిగలేదు. ఇందులో విఠల్‌రెడ్డి గెలుపొందారు. అనంతరం విఠల్‌రెడ్డి బీఆర్ఎస్‌లో చేరారు. ఇటీవల బీజేపీ టికెట్ ఆశించి భంగపడ్డ రమాదేవి కూడా కారెక్కారు. దీంతో ప్రత్యర్థులుగా ఉన్న విఠల్‌రెడ్డి, వేణుగోపాలచారి, రమాదేవి ఒకే పార్టీ సభ్యులయ్యారు. ఇప్పుడు విఠల్‌రెడ్డి కోసం రమాదేవి ప్రచారం చేస్తున్నారు. వేణుగోపాలచారి వర్గం మాత్రం ఆయనకు మద్దతు ఇవ్వకపోవడం విశేషం.

గంగాపూర్ ఓటు... ఎటో?

- సమస్యల పరిష్కారానికి నేతల హామీ
- బ్రిడ్జి నిర్మాణానికి బాండ్ పేపర్ రాసిచ్చిన ముగ్గురు అభ్యర్థులు



అవగాహన కల్పిస్తున్న అధికారులు(ఫైల్)

కడెం: కనీస సౌకర్యాలు లేక ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు కడెం మండలం మారుమూల ఉమ్మడి గంగాపూర్ వాసులు. ఐదేళ్లకోసారి ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా మా తలరాతలు మారడం లేదని, ఎన్నికలపుడు ఇచ్చే హామీలు హామీలుగానే మిగిలిపోతున్నాయని విసిగిపోయి, రాబోయే అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరించాలని నిర్ణయించుకున్నారు. ఉట్నూర్ ఆర్డీవో, ఈఆర్వో జీవాకర్‌రెడ్డి, నిర్మల్ ఆర్డీవో రత్నకళ్యాణి ఇటీవలే గ్రామంలో పర్యటించి ఎన్నికలను బహిష్కరించొద్దని, ప్రతి ఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని గ్రామస్తులతో మాట్లాడి ఒప్పించారు. మరోవైపు గ్రామస్తులు తమ హామీలను నమ్మడం లేదని, మూడు పార్టీల నాయకులు గ్రామస్తులకు బాండ్ పేపర్ రాసిచ్చారు.

ఇవీ ప్రధాన సమస్యలు..

గ్రామానికి ప్రధాన సమస్య రోడ్డు, కడెం ప్రాజెక్ట్ బ్యాక్‌వాటర్‌లో వంతెన నిర్మాణం పూర్తి కావాలి, దీంతోపాటు ఎత్తిపోతల పథకం, గిరిజన ఆశ్రమ పాఠశాల ఏర్పాటు చేయిస్తామని, బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భుక్యా జాన్సన్‌నాయక్, బీజేపీ అభ్యర్థి రాథోడ్ రమేశ్, కాంగ్రెస్ అభ్యర్థి వెడ్మ బొజ్జు బాండ్ పేపర్ రాసిచ్చారు.

ఓటు.. ఎటో?

ముగ్గురు అభ్యర్థులు సమస్యలు పరిష్కరిస్తామని బాండ్ రాసివ్వడంతో.. గంగాపూర్, రాణిగూడ, కొర్రతండా మూడు గ్రామ పంచాయతీల ఓటర్లు ఏటు వైపు మొగ్గు చూపుతారనేది కీలకంగా మారింది. రాణిగూడలో మొత్తం 494 ఓటర్లు ఉండగా ఇందులో 244 మంది పురుషులు, 250 మంది స్త్రీలు ఉన్నారు. మొత్తం ఎస్టీ గోండ్ సామాజిక వర్గానికి చెందిన వారే, ఇక్కడ కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు ఓట్లు పడే అవకాశం ఉంది. ఇక గంగాపూర్ పంచాయతీలో మొత్తం 764 ఓటర్లు ఉన్నారు. ఇందులో 376 మంది పురుషులు, 388 మంది స్త్రీలు ఉన్నారు. ఇక్కడ బీఆర్ఎస్,కాంగ్రెస్, బీజేపీకి ఓట్లు పడే అవకాశం ఉంది. కొర్రతండా పంచాయతీలో మొత్తం 411 ఓటర్లు కాగా, 202 మంది పురుషులు, 209 మంది స్త్రీలు ఉన్నారు. ఇక్కడ లంబాడ సామాజికవర్గానికి చెందిన వారే అధికం. ఇక్కడ బీఆర్ఎస్, బీజేపీకి ఓట్లు పడే అవకాశం ఉంది.

పోలింగ్ కేంద్రాలపై నిఘా ఉంచాలి

- పోలీస్ పరిశీలకులు లక్ష్మణ్ నింబర్గి



సమావేశంలో పాల్గొన్న ఎన్నికల పరిశీలకులు రవిరంజన్, లక్ష్మణ్ ,ఎస్పీ ప్రవీణ్ కుమార్

నిర్మల్‌టౌన్: శాంతియుత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకునేలా గట్టి చర్యలు చేపట్టాలని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై నిఘా ఉంచాలని పోలీస్ పరిశీలకులు లక్ష్మణ్ నింబర్గి, ఎస్పీ ప్రవీణ్‌కుమార్ సూచించారు. సాధారణ పరిశీలకులు రవి రంజన్‌కుమార్‌విక్రమ్, పోలీస్ పరిశీలకులు లక్ష్మణ్ నింబర్గి ఎన్నికల బందోబస్తు ఏర్పాట్లపై కలెక్టరేట్ మినీ సమావేశమందిరంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ముందుగా పోలీస్ బందోబస్తు ప్రక్రియను ప్రజెంటేషన్ ద్వారా ఎస్పీ వివరించారు. అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి మొత్తం 922 పోలింగ్ కేంద్రాలకు, నిర్మల్‌కు సంబంధించినవి 306, ముధోల్ 311, ఖానాపూర్ నియోజకవర్గానికి 305 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి ఎన్నికల విధులు నిర్వహించే పోలీస్ సిబ్బందికి పలు సూచనలు చేశారు.

సమన్వయంతో పనిచేయాలి..

ఈ సందర్భంగా పోలీస్ పరిశీలకులు లక్ష్మణ్ నింబర్గి మాట్లాడుతూ... ఎన్నికల నిర్వహణలో పోలీస్, రెవెన్యూ, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో, ఎన్నికల కమిషన్ నియమావళి ప్రకారం పనిచేయాలని సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు ప్రచారాలను వెంటనే గుర్తించాలన్నారు. పోలింగ్ శాతం పెరిగేలా ఓటరు నిర్భయంగా వచ్చి తన ఓటు వేసేలా చూడాలని తెలిపారు. ప్రతీ పోలింగ్ బూత్ దగ్గర ప్రతిష్ట భద్రత ఏర్పాట్లు చేయాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని ఆదేశించారు. పోలింగ్ బూత్‌కు 100 మీటర్ల దూరంలో వాహనాలు నిలిపేలా పార్కింగ్ ఏర్పాటు చేయాలన్నారు. కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరూ గుర్తుంచుకో..

అసెంబ్లీ ఎన్నికలకు పోలింగ్ కేంద్రాల వారీగా బీఎల్‌వోలు ఓటర్లకు పోల్‌చిట్టీలు పంపిణీ చేస్తున్నారు. చిట్టీల వెనక భాగంలో ప్రత్యేక గూగుల్‌మ్యాప్, నియోజకవర్గం, పోలింగ్ కేంద్రం పేరుతో పలు విషయాలు ముద్రించారు.

- వివరాలు 10లో▸

ఈవీఎంల పనితీరుపై అవగాహన అవసరం

- ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి
- నిర్మల్ కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

ఉట్నూర్‌రూరల్: ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పీవో, ఏపీవోలు ఈవీఎంల పనితీరుపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని నిర్మల్ కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఆశిష్ సంగ్వాన్ అన్నారు. స్థానిక కేబీ కాంప్లెక్స్‌లోని ప్రభుత్వ బీఈడీ కళాశాలలో పీవో, ఏపీవోలకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులకు మంగళవారం ఆయన హాజరై మాట్లాడారు. ఈవీఎం, వీవీప్యాట్, హ్యాండ్ బుక్, పోలింగ్ కేంద్రాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. పోలింగ్ మొదలుకొని పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలింగ్ ప్రారంభానికి 90 నిమిషాల ముందు ఏజెంట్ల సమక్షంలో మాక్ పోల్ నిర్వహించాలన్నారు. తర్వాత ఆ సమాచారం మొత్తం క్లియర్ చేసుకోవాలన్నారు. ఉదయం 7గంటలకు పోలింగ్ ప్రారంభించాలని సూచించారు. అనంతరం స్ట్రాంగ్ రూమ్, కమిషనింగ్ రూమ్‌లను పరిశీలించి బారికేడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆయన వెంట ఆర్వో జీవాకర్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది తదితరులున్నారు.

ఉద్యోగులు ఓటేశారు...

- ఎన్నికల విధుల నేపథ్యంలో ముందే వినియోగం
- రెండో విడత శిక్షణలోనే పోస్టల్ ఓటు



ఓటుహక్కును వినియోగించుకున్న ఉద్యోగులు

నిర్మల్‌ఖిల్లా: అసెంబ్లీ ఎన్నికల విధులు కేటాయించిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పీవోలకు నిర్మల్, ముధోల్ నియోజకవర్గ కేంద్రాల్లో ఎన్నికల నిర్వహణపై రెండో విడత శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. మంగళవారం సాయంత్రం శిక్షణ పూర్తయిన వారికి ఎన్నికల అధికారులు పోస్టల్ బ్యాలెట్‌ను అందించారు. ఎన్నికల విధుల్లో పాల్గొననున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకున్నారు. ఓటు వేసినట్లు వారి ఎడమచేతి చూపుడువేలికి సిరా గుర్తును వేశారు. మంగళ, బుధ, గురువారాల్లో కూడా ఏపీవోలకు, ఓపీవోలకు శిక్షణ కార్యక్రమం కొనసాగనుంది. వారు కూడా పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

వసతులు కల్పించాలి

కుంటాల: మండలంలోని లింబా(కే), ఓలా గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను జెడ్పీ సీఈవో సుధీర్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. విద్యుత్, మరుగుదొడ్లు, మూత్రశాలల వసతిపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఏపీవో గట్టుపల్లి నవీన్, పంచాయతీ కార్యదర్శులు గంగప్రసాద్, యోగేశ్, ఏఈవో ఉన్నారు.

ఇబ్బందులపై సిబ్బంది చర్చ!

- ఎన్నికల విధుల్లో ఉద్యోగులు, ఉపాధ్యాయులు
- కేటాయించిన పోలింగ్ కేంద్రాల దూరభారం
- విడిది సౌకర్యాలు, వసతులపై ఆరా..
- పోలింగ్ రోజు రాత్రివేళ తిరుగు ప్రయాణం
- వసతి కల్పిస్తామంటున్న అధికారులు



మామడ మండలం పరిమండల్ గ్రామంలో పోలింగ్‌కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎన్నికల అధికారులు(ఫైల్)

నిర్మల్ ఖిల్లా:శాసనసభ ఎన్నికలకు మరో వారం గడువుంది. ఈనెల 30న పోలింగ్ జరుగనుంది. జిల్లాలో ఇప్పటికే ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఎన్నికల విధులను కేటాయించారు. తొలి విడత శిక్షణ ఇప్పటికే పూర్తికాగా, ప్రస్తుతం రెండో విడత శిక్షణ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ ఏర్పాట్లు చేస్తోంది. అయితే పోలింగ్ విధుల్లో ఎదురయ్యే ఇబ్బందులపై ఉద్యోగుల్లో చర్చ జరుగుతోంది. ఒక రోజు ముందుగా అనగా 29న ఉదయాన్నే నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వద్ద కేటాయించిన పోలింగ్ కేంద్రానికి సామగ్రిని తీసుకుని చేరుకోవాల్సి ఉంటుంది. అక్కడే రాత్రివేళ బసచేయాలి. నిర్మల్, ముధోల్, ఖానాపూర్ నియోజకవర్గకేంద్రాలుండగా వీటిలో ఖానాపూర్ నియోజకవర్గ రిటర్నింగ్ కేంద్రంగా ఉట్నూర్ ఉండడంతో నిర్మల్ జిల్లాకు చెందిన సిబ్బందికి దూరభారం కానుంది. అక్కడ వసతి సౌకర్యాల గురించి ఆరా తీస్తున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద కనీస సౌకర్యాలు ఉన్నాయా లేవా అని తెలుసుకుంటున్నారు. గతానుభవాల దృష్ట్యా అసౌకర్యాలు తలెత్తకుండా ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.

పోలింగ్ విధులు ఇలా...

పోలింగ్ విధుల్లో ఇప్పటికే ఉద్యోగ, ఉపాధ్యాయులను నియమించారు. వీరిలో ఒక్కొక్క పోలింగ్ కేంద్రంలో పీవో, ఇద్దరు ఏపీవోలు, ఇద్దరు ఓపీఓలు అంటే మొత్తం నలుగురు ఉంటారు. 20% రిజర్వు సిబ్బందిని కలుపుకుని ఉమ్మడి జిల్లాలో పది నియోజకవర్గాల్లో ఎన్నికల విధులకు ఉద్యోగులను కేటాయించారు. కలెక్టరేట్‌లో నేషనల్ ఇన్ఫర్మేషన్ సెంటర్‌లో నిర్దేశిత సాఫ్ట్‌వేర్ ద్వారా ఎన్నికల ప్రత్యేక పరిశీలకుడి సమక్షంలో విధులను కేటాయిస్తారు. కేటాయించిన ఎన్నికల సిబ్బంది ఈ నెల 29న ఉదయం ఆయా నియోజకవర్గకేంద్రాల్లో రిటర్నింగ్ అధికారుల సమక్షంలో ఈవీఎంలు తదితర ఎన్నికల సామగ్రిని అప్పగించి విధులకు పంపిస్తారు. 30న ఎన్నికల విధుల్లో పాల్గొన్న సిబ్బంది పోలింగ్ పూర్తయిన అనంతరం సాయంత్రం తిరిగి అదే కేంద్రంలో అప్పగించిన తర్వాత వారి స్వస్థలాలకు వెళ్లాల్సి ఉంటుంది.

గైర్హాజరు కుదరదిక..

శాసనసభ ఎన్నికల నిర్వహణలో ఎన్నికల సిబ్బంది పాత్ర క్రియాశీలకం కావడంతో ఇందుకు కేటాయించిన సిబ్బంది తప్పనిసరిగా క్రమశిక్షణాయుతంగా విధుల్లో ఉండాల్సిందేనని ఎన్నికల అధికారులు పేర్కొంటున్నారు. పోలింగ్ విధుల్లో ఎదురయ్యే అసౌకర్యాల కారణంగా కొందరు ఎన్నికల విధులకు దూరంగా ఉండాలని భావిస్తున్నప్పటికీ శిక్షణ పూర్తి చేసుకున్న సిబ్బంది తప్పనిసరిగా ఎన్నికలకు విధులకు హాజరు కావాల్సిందేనని స్పష్టం చేస్తున్నారు. అన్నిరకాల వసతి సౌకర్యాలను కల్పిస్తున్నామని అంటున్నారు. పీఓలు, ఏపీవోలు, ఓపీవోలకు రెండో విడత శిక్షణ కూడా సోమవారం ఆయా నియోజకవ ర్గ కేంద్రాల్లో ప్రారంభమైంది. విధుల నుంచి మినహాయింపు పొందాలంటే వికలాంగులు లేదా తీవ్ర అనారోగ్య సమస్యల కారణాలతో ధ్రువీకరించుకుని జిల్లా ఎన్నికల అధికారికి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.నిబంధనలు కఠినతరంగా ఉండడంతో అలాంటి ప్రయత్నాలు చేయకుండా విధులకు హాజరవ్వడమే ఉత్తమమని భావిస్తున్నారు.

30న రాత్రి తిరుగు ప్రయాణం...

పోలింగ్ ముగిసే సమయం సాయంత్రం ఐదు గంటలకే అయినా ఆ సమయానికి పోలింగ్ కేంద్రం లోపల ఓటర్లు ఉంటే వారిని ఓటేసేందుకు అనుమతిస్తారు. ఈ రకంగా అక్కడే దాదాపు సాయంత్రం 7 గంటలు అయ్యే అవకాశం ఉంటుంది. ఈవీఎంలను ఎన్నికల సామగ్రిని జాగ్రత్తగా సర్దుకుని రిటర్నింగ్ అధికారి వద్దకు చేరుకోవాల్సి ఉంటుంది. ఇలా నిర్మల్ జిల్లాలో మూడు నియోజకవర్గ కేంద్రాలు ఉండగా నిర్మల్, ముధోల్ ప్రాంతాల్లో ఇబ్బంది లేనప్పటికీ ఖానాపూర్ నియోజకవర్గ కేంద్రం ఉట్నూరులో ఉండడం మూలంగా కేటాయించబడిన సిబ్బంది ఖానాపూర్ పరిసర ప్రాంతాల్లో విధులు ముగించుకొని మళ్లీ దూరంగా ఉన్న ఉట్నూర్ చేరుకోవాల్సి ఉంటుంది. అక్కడ ఎన్నికల సామగ్రి అప్పగించి స్వస్థలాలకు వెళ్లాలి. ఇదంతా పూర్తయ్యే సరికి దాదాపు రాత్రి 10 గంటల సమయం పట్టేఅవకాశం ఉందని ఉద్యోగులు పేర్కొంటున్నారు. 29వ తేదీ ఉదయం నుంచి 30వ తేదీ రాత్రి వరకు వీరికి అన్ని రకాల వసతి సౌకర్యాలు భోజన సౌకర్యాలు కల్పించేందుకు ఇన్‌చార్జీలు, సెక్టోరియల్ అధికారులు ఉంటారని చెబుతున్నారు గత ఎన్నికల సందర్భంలో తిరుగు ప్రయాణంలో ఇబ్బందులు ఎదుర్కొన్నామని సిబ్బంది పేర్కొంటున్నారు.

'నంబర్ వన్' మనమే అవ్వా..


ఓటు వేయాలని వృద్ధురాలికి వివరిస్తున్న అనిల్‌జాదవ్

ఎన్నికల ప్రచారంలో భాగంగా బోథ్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్‌జాదవ్ తలమడుగు మండలం చెర్లపల్లి గ్రామంలో పర్యటించారు. వీవీ ప్యాట్‌ను చేతపట్టుకొని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ క్రమంలో ఓ అవ్వ వద్దకు వెళ్లి వీవీప్యాట్‌లో మొదటి నంబర్ మనదే అవ్వా.. గుర్తుంచుకొని కారు గుర్తుకే ఓటు వేయాలని ఓటు అభ్యర్థించిన చిత్రమిది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

పతుల కోసం.. సతుల ప్రచారం


ఓటును అభ్యర్థిస్తున్న శ్రీనివాసరెడ్డి సతీమణి


భోజనం చేస్తూ ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే సతీమణి

అసెంబ్లీ బరిలో నిలిచిన అభ్యర్థులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. గ్రామాలు, వార్డులను సుడిగాలిలా చుట్టేస్తున్నారు. వారి గెలుపు కోసం కుటుంబీకులు సైతం ప్రచారబాట పట్టారు. ఇంటింటికి తిరుగుతూ అభ్యర్థులు గుర్తులు, మేనిఫెస్టోలను వివరిస్తూ గెలిపించాలని కోరుతున్నారు. ఆదిలాబాద్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి జోగు రామన్న సతీమణి జోగు రమ రణదీవెనగర్‌లో, కాంగ్రెస్ అభ్యర్థి కంది శ్రీనివాసరెడ్డి సతీమణి సాయిమౌనరెడ్డి పిట్టల్‌వాడలో ఓట్లు అభ్యర్థించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

బీజేపీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా


మాట్లాడుతున్న బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సతీమణి కవితారెడ్డి

బీజేపీ నిర్మల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మహేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని అతడి సతీమణి కవితారెడ్డి కోరారు. మంగళవారం మండల కేంద్రంలో రాత్రి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. ఎంపీపీ అడ్వాల పద్మ, నాయకులు అడ్వాల రమేష్, భూపాల్‌రెడ్డి, ఉన్నారు.

– లక్ష్మణచాంద

ఆడబిడ్డలతో సెల్ఫీ..


కల్యాణలక్ష్మి పొందిన లబ్ధిదారులు మంత్రితో సెల్ఫీ తీసుకుంటూ..

ఎన్నికల ప్రచారంలో భాగంగా దిలావర్‌పూర్ మండలంలో మంత్రి ఐకేరెడ్డి మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండలంలోని మాడేగాం గ్రామంలో కల్యాణలక్ష్మి పొందిన ఆడపడుచులు అల్లోలతో సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు. ఈ సందర్భంగా కారు గుర్తుకు ఓటువేసి తనను గెలిపించాలని మంత్రి వారిని అభ్యర్థించాడు.

– దిలావర్‌పూర్

క్లుప్తంగా

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య


షేక్‌అమిర్(ఫైల్)

దస్తురాబాద్: మద్యానికి బానిసై యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై రజనీకాంత్ వివరాల ప్రకారం... షేక్ అమిర్(25) మద్యానికి బానిసై తరచుగా భార్యతో గొడవపడేవాడు. ఇదే క్రమంలో వారం రోజుల క్రితం భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురై గ్రామ శివారులోని భీమన్న చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

గుడుంబా స్థావరాలపై దాడులు


బెల్లం పానకం చూపుతున్న సిబ్బంది

కడెం: మండలంలోని చిన్నబెల్లాల్, పాండ్వపూర్ గ్రామాల్లోని గుడుంబా స్థావరాలపై మంగళవారం ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 22లీటర్ల గుడుంబా, 2400 లీటర్ల పులియబెట్టిన బెల్లం పానకం డ్రమ్ములను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ ఎస్సై రాయబారపు రవికుమార్ తెలిపారు. ఇందులో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ గంగారెడ్డి, ఎక్సైజ్ సిబ్బంది ఇంతియాజ్, ఆశ్వక్, పాయి, ప్రసాద్, నరేందర్, ముత్యం, జమీర్, గౌత, వెంకటేష్, భాస్కర్, తేజ ఉన్నారు.

బాలికల ఆచూకీ లభ్యం

భైంసాటౌన్: పట్టణంలోని బస్టాండ్ ప్రాంతం నుంచి అదృశ్యమైన ఇద్దరు బాలికల ఆచూకీ లభ్యమైనట్లు ఆ బాలికల కుటుంబీకులు తెలిపారు. మంగళవారం ఉదయం బస్టాండ్ ప్రాంతంలో కనిపించినట్లు పేర్కొన్నారు.

ఇంతింతై.. 40 రెట్లై

- నలభై రెట్లు పెరిగిన అసెంబ్లీ ఎన్నికల వ్యయం
- తొలి ఎన్నికల్లో రూ.లక్ష మాత్రమే గరిష్ట పరిమితి
- ప్రస్తుతం ఎమ్మెల్యే అభ్యర్థికి రూ.40 లక్షలు
- ప్రతీ రూపాయికి లెక్క పక్కాగా ఉండాల్సిందే
- ఎన్నికల కమిషన్ నిర్దేశిత నియమావళి ఇదే...

నిర్మల్ ఖిల్లా: ప్రస్తుతం శాసనసభ ఎన్నికల సమరం కొనసాగుతోంది. మరోవారం రోజుల్లో పోలింగ్ ఉండడంతో విచ్చలవిడిగా డబ్బు ఖర్చు పెట్టే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఎన్నికల నియమావళి ప్రకారం బరిలో నిలిచిన ఎమ్మెల్యే అభ్యర్థులు ఇష్టారీతిన డబ్బు ఖర్చు చేయడానికి వీలులేదు. ప్రస్తుత ఎన్నికల నిబంధనలు అనుసరించి వ్యయపరిమితి గరిష్టంగా రూ.40 లక్షలు మాత్రమే విధించబడినది. అయితే ఈ వ్యయ పరిమితి గతంలో ఉన్నదానికంటే క్రమంగా ×ఇంతింతై వటుడింతై...'అన్న చందంగా పెరుగుతూ వస్తోంది. భారతదేశంలో స్వాతంత్ర్యానంతరం 1952లో జరిగిన తొలి సాధారణ ఎన్నికల్లో అప్పటి అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల్లో పోటీ చేసిన ఒక్కో ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్నికల ఖర్చు గరిష్టంగా రూ.లక్షగా నిర్దేశించబడింది. అప్పటి నుంచి ప్రతీసారి పెరుగుతూ వస్తోంది. ప్రస్తుతం 2023 ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థికి గరిష్టంగా రూ.40 లక్షలు ఖర్చు చేయడానికి వ్యయపరిమితి విధించబడింది. అంటే ఎన్నికలు ప్రారంభమైన ఏడు దశాబ్దాల కాలంలో దాదాపు 40 రెట్లు పెరుగుతూ వచ్చింది.

నామినేషన్ వేసిన రోజు నుంచే లెక్క షురూ..

2014 అసెంబ్లీ ఎన్నికలకు రూ.28 లక్షలుగా ఉన్న అభ్యర్థుల వ్యయ పరిమితిని కేంద్ర ఎన్నికల కమిషన్ ఏకంగా రూ.40 లక్షలకు పెంచింది. లోక్‌సభ ఎన్నికల వ్యయ పరిమితిని రూ.95 లక్షలుగా నిర్ణయించింది. నామినేషన్ వేసిన రోజు నుంచి పోలింగ్ జరిగే వరకు అభ్యర్థి చేసే ఖర్చును ఎన్నికల ఖర్చుగా పరిగణిస్తారు. పార్టీ చేసే ఖర్చు మాత్రం అభ్యర్థి వ్యయంలోకి రాదు. ఎన్నికల ప్రచారానికి అభ్యర్థులు చేసే ఖర్చులను బ్యాంకు ఖాతా ద్వారానే నిర్వహించాలి. అందుకోసం నామినేషన్ దాఖలు చేసే నాటికే పోటీలో ఉన్న అభ్యర్థులంతా కొత్తగా బ్యాంకు అకౌంట్ ప్రారంభించుకున్నారు..

ఓటర్లను ప్రలోభపెట్టేందుకు లేదా ప్రభావితం చేసేందుకు అభ్యర్థులు ఎలాంటి ఖర్చు చేయరాదని ఎన్నికల నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. ఎన్నికల తనిఖీల్లో పట్టుబడిన తాయిలాలను అభ్యర్థుల వ్యయంలో చేర్చాలని ఎన్నికల కమిషన్ తాజాగా ఆదేశాలు జారీ చేసింది. రోజువారీగా అభ్యర్థులు చేసే వ్యయంతో పాటు పార్టీ జెండాలు, బ్యానర్లు, కరపత్రాలు, పోస్టర్లు, టోపీలు, కండువాలు, భోజనాలు, వాహనాల అద్దె, ఇంధన ఖర్చులు, సభా వేదికలు, మైకులు, పత్రికలు, టీవీ, సోషల్ మీడియా ప్రకటనలకు చేసే ఖర్చులను కలిపి అభ్యర్థి ఎన్నికల వ్యయంగా లెక్కిస్తారు. వీటిలో ప్రతి దానికీ బిల్లులు చూపించాల్సి ఉంటుంది. వీటన్నింటికి ఎన్నికల సంఘం ధరలు నిర్ణయిస్తుంది. వాటి ప్రకారమే లెక్కలు చూపించాల్సి ఉంటుంది. ఇవి గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వేర్వేరుగా ఉన్నాయి.

పెరుగుతున్న వ్యయపరిమితి..

1952 సాధారణ ఎన్నికల్లో రూ.లక్షతో ప్రారంభమైన ఎన్నికల వ్యయ పరిమితి 1962 నాటికి రూ.3 లక్షలు 1971 ఎన్నికల నాటికి రూ.4 లక్షలు, 1975 నాటికి రూ.5 లక్షలు పెరుగుతూ వచ్చింది. 1984లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఏకంగా రూ.10 లక్షలకు చేరువైంది. 1991 నాటికి మరో రెండు లక్షలు పెరిగి రూ.12 లక్షలకు చేరుకుంది. 1999లో రూ.15 లక్షలు, 2004 నాటికి రూ.17 లక్షలు, 2009లో రూ.26 లక్షలు, 2014లో రూ.28 లక్షల వ్యయపరిమితిని విధించారు. ప్రస్తుతం జరుగుతున్న 2023 ఎన్నికల్లో ఈ గరిష్ట వ్యయపరిమితి రూ.40 లక్షలకు చేరుకుంది.

వ్యయపరిమితి పెరుగుదల ఇలా..

సంవత్సరం	వ్యయపరిమితి (రూ.లక్షలలో)
1952	1
1962	3
1971	4
1975	5
1984	10
1991	12
1999	15
2004	17
2009	26
2014	28
2023	40

ఓటరూ గుర్తుంచుకో..

- నవంబర్ 30 మర్చిపోకు
- చిట్టీలతో పోలింగ్ కేంద్రానికి మార్గసూచి..
- ఓటు వేసేలా చైతన్యం

జంగ్ తెలంగాణ

మంచిర్యాలఅర్బన్: తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీకి ఈ నెల 30న ఎన్నికలు జరగనున్నాయి. ఇందులో భాగంగా పోలింగ్ కేంద్రాల వారీగా బీఎల్‌వోలు ఓటర్లకు పోల్‌చిట్టీలు పంపిణీ చేస్తున్నారు. ×ఓటు మనందరి బాధ్యత.. హక్కు కూడా.. తప్పనిసరిగా ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలి.. ఓటరు చైతన్యంగా ఓటు వేసేలా చిట్టీ వెనకాల వివరాలు రాశారు. ఎన్నికల రోజున నేరుగా పోలింగ్ కేంద్రానికి చేరుకునే విధంగా పోల్ చిట్టీల వెనక భాగంలో ప్రత్యేక గూగుల్‌మ్యాప్, నియోజకవర్గం, పోలింగ్ కేంద్రం పేరుతో పలు విషయాలు ముద్రించారు.

ఓటు వేసేందుకు ఇవి తప్పనిసరి..

పోల్‌చిట్టీలో ఎన్నికల సంఘం ప్రవేశపెట్టిన 12 రకాల గుర్తింపుకార్డుల్లో ఏదైనా ఒక దానిని వెంట తీసుకెళ్లి ఓటు వేయాలనే అంశాలను పొందుపర్చారు. పోలింగ్ కేంద్రం వద్ద ఓటరు చీటి, గుర్తింపు కార్డులను చూపించాలి. పోలింగ్ అధికారి ఓట రు జాబితా, గుర్తింపు కార్డులో పేరును పరిశీలిస్తారు. మరో అధికారి వేలికి ఇంకు పెడతారు. తర్వాత ఓచీటి ఇస్తారు. మూడో అధికారి ఆచీటీని పరిశీలిస్తారు. తర్వాత ఈవీఎంలో మీరు ఎన్నుకోవాల్సిన అభ్యర్థికి చెందిన బటన్ నొక్కాల్సి ఉంటుంది. ఓటు వేసిన తర్వాత స్లిప్ వస్తుంది. పక్కనే వీవీప్యాట్‌లో చూసుకునే వీలుంది. ఓ టు నిర్ధారించుకున్న తర్వాతే అక్కడి నుంచి కదలాలి.


పోల్‌చిట్టీలపై ముద్రించిన మ్యాప్, అంశాలు

పోల్‌చిట్టీలపై మరిన్ని..

ఓటర్లకు పంపిణీ చేస్తున్న పోల్‌చిట్టీల్లో మరిన్ని అంశాలు పొందుపర్చారు. పోలింగ్ సమయంలో క్యూలో ఉన్న ఓటర్లందర్నీ ఓటు వేయడానికి అనుమతిస్తారు. మహిళలకు ప్రత్యేక క్యూ ఉంటుంది. సీనియర్ పౌరులకు ఓటు వినియోగంలో ప్రాధాన్యత ఇస్తారు. మొబైల్ ఫోన్లు, కెమెరాలు వంటి గాడ్జెట్లకు పోలింగ్ బూత్ లోపలికి అనుమతి లేదు. ఏదైనా ఒక ప్రత్యేక అభ్యర్థికి ఓటు వేసే నిమిత్తం డబ్బును అంగీకరించడం, ఏ ఇతర వస్తువులను స్వీకరించడం చట్టప్రకారం అవినీతికి పాల్పడినట్లు పరిగణించబడుతుందని తెలుగు, ఇంగ్లిష్ భాషలతో ముద్రించిన పోల్ చిట్టీలు పంపిణీ చేస్తున్నారు.

హత్య చేసిన ఇద్దరి అరెస్టు

- భూవివాదమే కారణం..

బేల: ఈ నెల 14న రాత్రి మండలంలోని కరోని(బి) రెవెన్యూ గ్రామ శివారులో జరిగిన తొడసం బండు హత్య కేసులో అదే గ్రామానికి చెందిన కుచాడే రాజు, పెందుర్ సంజయ్‌లను అరెస్టు చేసినట్లు సీఐ కోల నరేష్‌కుమార్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించాడు. విచారణలో భాగంగా రాజు, సంజయ్‌లను అరెస్టు చేశామని, హత్యకు గురైన తొడసం బండు కొన్నేళ్లుగా కుచాడే రాజుతో భూవివాదంలో గొడవ పడుతున్నారు. ఈ క్రమంలో కుచాడే రాజు తండ్రి మరణం తరువాత వీరి మధ్య గొడవ మరింతగా పెరిగింది. అయితే ఈ నెల 14న రాత్రి బేల నుంచి గ్రామానికి తిరుగు ప్రయాణమైన బండు అతిగా తాగి గ్రామ శివారులోని బ్రిడ్జి వద్ద పడి ఉండడాన్ని గమనించిన రాజు, అతడి స్నేహితుడు పెందుర్ సంజయ్‌తో కలిసి కత్తితో గొంతు కోసి హత్య చేశాడు. మరణించాడని నిర్ధారించుకున్న తరువాత మృతదేహన్ని వాగులో పడేశారు. వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపాడు. సమావేశంలో ఎస్సై రాధిక, ఏఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీఐ కోల నరేష్‌కుమార్

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

పెంబి: అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని నాయికపుగుడాలో చోటుచేసుకుంది. ఎస్సై రజనీకాంత్ వివరాల ప్రకారం... కస్తూరి చిన్నరాజన్న(42) తనకున్న ఎకరం భూమితో పాటు మరో మూడెకరాలు కౌలుకు తీసుకుని పత్తి పంట సాగుచేశాడు. పంట ఆశించిన స్థాయిలో దిగుబడి రాకపోవడం, అలాగే గత సంవత్సరం కూతురి పెళ్లికి రూ.3లక్షలు అప్పు కావటంతో జీవితంపై విరక్తితో పొలంలో గుర్తు తెలియని పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు ఖానాపూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.


పంచనామా నిర్వహిస్తున్న ఎస్సై

రోడ్డు నిర్మిస్తాం... ఓట్లేయండి


గ్రామస్తులతో మాట్లాడుతున్న నాయకులు

తాంసి: భగవాన్‌పూర్ గిరిజన గ్రామానికి రోడ్డు త్వరలోనే వేస్తామని గ్రామస్తులు ఎన్నికల్లో పాల్గొనాలని మండల ప్రజాప్రతినిధులు గ్రామస్తులను కోరారు. భగవాన్‌పూర్ గ్రామస్తులు తమ గ్రామానికి రోడ్డు లేక రానున్న అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరించనున్నట్లు గ్రామస్తులు తీర్మానించిన విషయం తెలిసిందే. మంగళవారం భీంపూర్ జెడ్పీటీసీ సుధాకర్, ఎంపీటీసీ రాకేష్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులతో కలిసి గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో గ్రామస్తులు పాల్గొని ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. గ్రామానికి రోడ్డుతో పాటు, త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేసే విధంగా చూస్తామన్నారు. రోడ్డు నిర్మాణం చేపడితేనే ఎన్నికల్లో పాల్గొంటామని స్పష్టం చేశారు. అలాగే ప్రజాప్రతినిధులు బాండ్ రాసివ్వాలని గ్రామస్తులు కోరారు. తమపై నమ్మకంతో ఓటింగ్‌లో పాల్గొనాలని కోరడంతో గ్రామస్తులు అంగీకరించారు. గ్రామపటేల్ మల్కు, రాంప్రసాద్, యువరాజ్, నాయకులు సంజీవ్‌రెడ్డి, ధన్‌రాజ్, కపిల్ ఉన్నారు.

మద్యం పట్టివేత


పట్టుకున్న మద్యంతో సీఐ నవీన్‌కుమార్

లక్ష్మణచాంద: మండలంలోని పార్‌పెల్లిలో నిల్వ చేసిన మద్యాన్ని పట్టుకున్నట్లు సోన్ సీఐ నవీన్ కుమార్ మంగళవారం తెలిపారు. మండలంలోని పార్‌పెల్లిలో ఓ వ్యక్తి ఇంట్లో అక్రమంగా మద్యం నిల్వ చేశారనే సమాచారంతో సీఐ ఆధ్వర్యంలో ఎస్సై శ్రీకాంత్ సిబ్బందితో ఇంట్లో సోదా చేసి 192 ఎంసీ క్వాటర్లను స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.37వేలు ఉంటుందని తెలిపారు. సిబ్బంది సంజీవ్, కిరణ్, అశోక్, దిలిప్‌గౌడ్ ఉన్నారు.

ఎదులాపురం: పట్టణంలోని వినాయక్‌చౌక్ ప్రాంతంలో మంగళవారం సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ డి.సాయినాథ్ సిబ్బందితో వాహనాల తనిఖీ చేపట్టారు. బంగారిగూడకుకి చెందిన శ్రీనివాస్ బెల్ట్ షాపు నిర్వహణకై రూ.2వేలు విలువ చేసే 25 లిక్కర్ బాటిల్స్ తీసుకెళ్తుండగా వాటిని గుర్తించి సీజ్ చేశారు. శ్రీనివాస్‌ని అదుపులో తీసుకొని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

తప్పుల తడకగా ఓటరు కార్డు



తప్పులతో ఓటరు కార్డు

బోథ్: ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా ఓటరు కార్డుల్లో మాత్రం తప్పులు వస్తూనే ఉన్నాయి. తాజాగా బోథ్ మండలంలోని ధన్నూర్ గ్రామానికి చెందిన మడావి నవీన్‌కుమార్‌కు పోస్టు ద్వారా మంగళవారం ఓటరు కార్డు వచ్చింది. ఓటరు కార్డును చూసిన నవీన్ షాకయ్యాడు. ఓటరు కార్డులో తన ఫొటో లేకపోవడంతో పాటు ఇంగ్లిష్ భాషలో తన పేరు, తండ్రి పేరు సరిగానే ఉన్నా, తెలుగు భాషలో తన పేరుకు బదులు జాదవ్ దేవిదాస్, తండ్రి పేరు భూమన్న మడావికి బదులు సుభాష్ జాదవ్ అని వచ్చింది. అలాగే అడ్రస్ కూడా ధన్నూర్‌కు బదులు కుచిర్యాల్‌గా ముద్రించారు. ఓటరు కార్డుపై ఇన్ని తప్పులా అంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశాడు.

విద్యుదాఘాతంతో యువకుడి దుర్మరణం

- మరో ముగ్గురికి గాయాలు
- గడ్డి తరలిస్తుండగా ఘటన


ఆదినాథ్(ఫైల్)

భైంసాటౌన్: నిర్మల్ జిల్లా భైంసా మండలం కుంసర గ్రామ శివారులో విద్యుదాఘాతంతో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. మరో ముగ్గురు గాయపడ్డారు. మంగళవారం రాత్రి ఐచర్ వాహనంలో గడ్డి తరలిస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. మహారాష్ట్రలోని రేనాపూర్‌కు చెందిన ఆదినాథ్(20), రోహిదాస్, ఆకాశ్ వరి గడ్డి తీసుకెళ్లేందుకు కుంసర గ్రామానికి వచ్చారు. ఐచర్ వాహనంలో గడ్డి మోపులు తరలిస్తున్న క్రమంలో మంగళవారం సాయంత్రం పైనున్న విద్యుత్ తీగలు తగిలి గడ్డితోపాటు వాహనానికి మంటలు అంటుకున్నాయి. ఈ ఘటనలో ఆదినాథ్ విద్యుదాఘాతంతో తీవ్ర గాయాలపాలు కాగా, రోహిదాస్, ఆకాశ్‌తోపాటు కుంసరకు చెందిన శంకర్‌రావు గాయాల పాలయ్యారు. స్థానికులు వెంటనే భైంసాలోని ఏరియా స్పత్రికి తరలించగా, పరిస్థితి విషమించి ఆదినాథ్ మృతిచెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. కాగా, ఆదినాథ్ ఎల్ఎల్‌బీ చదువుతుండగా, బాబాయితో కలిసి గడ్డిమోపులు తీసుకెళ్లేందుకు వచ్చి మృత్యువాత పడడంతో కన్నీరు మున్నీరుగా రోదించారు.



గాయాలపాలైన ఆకాశ్, రోహిదాస్

సీఈఎస్ఎస్‌లో తాంసి విద్యార్థులు

తాంసి: అంతర్జాతీయ బాలల హక్కుల పరిరక్షణలో భాగంగా శనివారం హైదరాబాద్‌లోని సీఈఎస్ఎస్‌లో నిర్వహించిన కార్యక్రమంలో తాంసిలోని జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. బాలల దినోత్సవంలో భాగంగా సెంటర్ ఫర్ ఎకనామిక్స్ అండ్ సోషల్ స్టడీస్‌లో ఘనంగా బాలల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రంలోని పలు జిల్లాలకు చెందిన పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. మహిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో తాంసికి చెందిన రఘు, స్వామి, లత తదితర విద్యార్థులు పాల్గొని బాలల హక్కులు, సమస్యలపై వివరించారు. ప్రోగ్రాం డైరెక్టర్ రమేష్‌శేఖర్‌రెడ్డి, పీసీఆర్ శ్రీనివాస్‌రావు, మురళీకృష్ణ, కోఆర్డినేటర్ డేవిడ్, బాలచందర్, ఇమ్రాన్ ఉన్నారు.


హైదరాబాద్‌లోని కార్యక్రమంలో విద్యార్థులు

రోడ్డు ప్రమాదంలో ఐఎఫ్‌టీయూ నాయకుడు మృతి

జైపూర్: మండలంలోని టేకుమట్ల క్రాస్‌రోడ్డు వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి తోకల తిరుపతి (40) మృతి చెందాడు. ఎస్సై ఉపేందర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. సోమనపల్లికి చెందిన తిరుపతి మంచిర్యాలో నివాసం ఉంటున్నాడు. పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వెళ్లి వస్తుండగా రోడ్డుపై నిలిపి ఉంచిన పొక్లెయిన్‌ను ఢీకొట్టాడు. ఘటనలో తిరుపతి అక్కడికక్కడే మృతి చెందగా వెనుక కుర్చున్న రామిళ్ల మహేందర్‌కు స్వల్పగాయాలయ్యాయి. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పలువురి సంతాపం

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని మార్క్స్ భవన్‌లో మంగళవారం తిరుపతి పార్థివ దేహానికి సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ కేంద్రకమిటీ సభ్యులు వేములపల్లి వెంకట్రామయ్య, రాష్ట్ర కమిటీ సభ్యుడు టి.శ్రీనివాస్, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు లాల్‌కుమార్, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానందం, కార్యదర్శి శ్రీనివాస్, పీవోడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి అందె మంగ, తదితరులు నివాళులర్పించారు.


తిరుపతి (ఫైల్)

రూ.లక్ష నగదు పట్టివేత

వాంకిడి(ఆసిఫాబాద్): మండల కేంద్రంలోని టోల్ ప్లాజా వద్ద మంగళవారం నిర్వహించిన వాహనాల తనిఖీలో రూ.లక్ష నగదు పట్టుకున్న ట్లు ఎస్సై సాగర్ తెలిపారు. ఆర్ఎస్సై గోపీకృష్ణ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహిస్తుండగా మహా రాష్ట్రలోని అహ్మద్ నగర్‌కు చెందిన షబ్బీర్ ఖురేషి అనే వ్యక్తి తన వాహనంలో ఎలాంటి ఆధారాలు లేకుండా రూ.లక్ష నగదు తరలిస్తుండగా పట్టుకుని సీజ్ చేసినట్లు తెలిపారు. సదరు వ్యక్తి సిరోంచకు వెళ్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఒకరికి గాయాలు..

ఆదిలాబాద్‌రూరల్: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. మావల ఎస్సై విష్ణువర్ధన్ వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని కోర్పన గ్రామానికి చెందిన కుడ్మెత వాసుదేవ్ బైక్‌పై ఆదిలాబాద్ నుంచి ఇంద్రవెల్లి వైపు వెళ్తున్నాడు. ఈ నెల 10న హరితవనం పార్కు ఎదుట కారు వెనుకనుంచి ఢీకొంది. దీంతో తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడు మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పాడు.